నేడు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 9: చిలకలగూడ, భవానినగర్ లో నేడు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని సీతాఫల్ మండి డివిజన్ కార్పొరేటర్ హేమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేటర్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 9: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి గోల్కొండ ఎక్స్‌రోడ్, పార్శిగుట్ట, మదర్ డైరీ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సోమవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు గోల్కొండ ఎక్స్ రోడ్, స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని ఎక్‌మినార్ మసీదు, కృష్ణకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పార్శిగుట్ట, మదర్ డైరీ ఫీడర్ పధిలోని ప్రేయర్ పవర్ చర్చి, బాప్టిస్ట్ చర్చి, రాంనగర్, బ్రహ్మంగారి టెంపుల్, ఈడబ్ల్యుఎస్ క్వార్టర్స్, రాంనగర్ ఎక్స్ రోడ్, మదర్ హైస్కూల్, లక్ష్మమ్మ పార్కు పరిసరా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

సెల్‌ఫోన్ల అప్పగింత

కీసర, ఫిబ్రవరి 9; కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను క్రైం బృందం బాధితులకు అప్పగించింది.ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, క్రైం బృందం సభ్యుడు జి.వెంకట నారాయణ, డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి 4 సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు.

త్రిపీటక పఠన సమ్మేళనం

- ఆనంద బుద్ధ విహార్‌కు తరలివచ్చిన బౌద్ధులు
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన బిక్షువులు

త్రిపీటకాల పఠనం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధ బిక్షువులు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 9: మహేంద్రహిల్స్‌లోని ఆనంద బుద్ధ విహార్‌లో త్రిపీటక పఠన సమ్మేళనం నిర్వహించారు. బుద్ధం సరణం గచ్ఛామి, దమ్మం సరణం గచ్ఛామి, సంఘం సరణం గచ్ఛామి అంటూ అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల త్రిపీటక పఠన సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 150 బిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లైఫ్ ఆఫ్ బుద్ధ ధర్మ ఫౌండేషన్ ఇంటర్నేషనల్–తెలంగాణ పర్యాటక శాఖ సంయుక్త సహకారం సమ్మేళనం కొనసాగింది. దక్షిణ భారత్‌లో మొదటి సారిగా అంతర్జాతీయ స్థాయిలో మొదటి త్రిపీటక సద్దమ్మ సజ్జయాన కార్యక్రమం ఘనంగా జరిగింది. బిక్షువులు బుద్ధుని మార్గదర్శకాలను వివరించారు.

ప్రార్థనలు చేస్తున్న బౌద్ధులు

బుద్ధుడు రచించిన పంచశీల సూత్రాలతో పొందుపరిచిన గ్రంథాన్ని మొదటి సారిగా త్రిపీటక అనే గ్రంథం ద్వారా రూపొందించి వాటిలో పొందుపరిచిన వివరాలను కార్యాక్రమంలో ఆహ్వానితులుగా వచ్చిన వారికి బోధించారు. మహా బోధిని సందేశాలు, సత్యమార్గంలో నడవటం, అబద్దాలు ఆడకుండా జీవనం, మనిషిని గౌరవించుకోవడం, సమాజంలో అందరూ గౌరవంగా జీవించుట, సంప్రదాయాలు విలువలు అన్ని పాటిస్తూ బౌద్ధ ఆశయాలు ఏ విధంగా ఆచరించాలో తెలిపారు. కార్యక్రమంలో వగ్నోదీక్షిత్‌తో పాటు ప్రముఖ వక్తలు ఆనందిక్షావ్, కసప్ప, బుద్దిపాల్ పాల్గొని మహా బోధ బుద్దుడి సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా మహేంద్రహిల్స్‌లోని ప్రధాన రహదారి నుంచి మహా బుద్ధ సొసైటీ మందిరం వరకు బౌద్ధ బిక్షువులు ర్యాలీ నిర్వహించారు.

పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అడిక్‌మెట్ బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ పటిష్టతకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం అడిక్‌మెట్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకు వెళ్లి విజయవంతం చేయడానికి కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలునిచ్చారు. పార్టీ తీసుకోబోయే నిర్ణయాలను అమలు చేస్తూ పటిష్టతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ఎర్రం శ్రీనివాస్ గుప్త, నాయకులు కె.సురేందర్, నేత శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, గురుదీప్, హమ్మద్, హరీష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 9: ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ తన ఉదారత చాటుకున్నారు. వారికి తన సొంత డబ్బులను చెక్కు రూపంలో అందజేసి వారికి తోడ్పాటు అందించారు. ఈ మేరకు వారిని కళాశాలలో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. కర్తవ్య మార్గ్ న్యూఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర కవాతులో పాల్గొన్న ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్స్, గీత, రమ, శ్రీధర్‌కు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. గంగాధర్ ఒక్కొక్కరికి రూ.ఐదు వేల చొప్పున చెక్కు రూపంలో అందించి, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ క్యాడెట్స్ చిత్త శుద్ధి, నిబద్ధతలకు మారుపేరని, దేశ సేవలో ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించేలా తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందజేస్తానని పేర్కొన్నారు. నంబర్ వన్ తెలంగాణ ఎయిర్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ ప్రశాంత్ సూర్యవంశీ, నంబర్ త్రీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ శరత్ మాట్లాడారు. అడ్మినిస్ట్రేటి ఆఫీసర్ మంజిల్ శర్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు, జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.గంగాధర్

గ్యార్వీ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

బోయిగూడలోని జై ప్రకాష్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన గ్యార్వీలో సనత్‌నగర్ ఎంఎల్ఏ తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, వెంకట్, ముక్కా శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 9:

క్రికెట్ క్రీడాకారిణి త్రిషకు ఘన సన్మానం

క్రీడాకారిణి త్రిషను సన్మానిస్తున్న పలువురు నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 9: సికింద్రాబాద్‌కు చెందిన క్రీడాకారిణి త్రిషను ఆదివారం ఘనంగా సన్మానించారు. అండర్–19 టీ20 మహిళల వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో సత్తాచాటిన తెలుగు అమ్మాయి గోంగడి త్రిషను కలిసి నాయకులు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, కుమార్, ప్రతాప్, అశోక్ కుమార్, శంకర్, ప్రవీణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పద్మారావునగర్ లోని స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్ల పక్కన ఉండే అనాథలు, నిరాశ్రయులకు ఆదివారం 270వ అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు పావని, సభ్యులు ఆంజనేయులు, రాజేశ్వర్ రెడ్డి, క్రాంతికుమార్, వంశీ, భానుప్రకాష్ పాల్గొన్నారు. – బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 9:

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజలతో మాట్లాడుతున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, ఫిబ్రవరి 9: డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. స్కైలాబ్ హోటల్ సమీపంలో మంచినీటి, మురుగు సమస్య తరచూ తలెత్తుతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆదివారం కార్పొరేటర్ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో మురుగు, మంచినీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలియజేశారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సదరు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె పేర్కొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు సృజనాత్మకతకు మూలం

వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 9: విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మతను పెంపొందిస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ క్రీడా మైదానంలో రెడియంట్ హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ 2025 ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన వ్యవసాయం, రోడ్డు భద్రత, నీటి పారుదల వంటి సైన్స్ ఎగ్జిబిట్‌లు ప్రశంసనీయమన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి శ్రావన్‌కుమార్, బీఆర్ఎస్ నేత, రెడియంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్ భక్తియార్, తదితరులు పాల్గొన్నారు

బొల్లారం: విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడుతాయని వాణి కాన్వెంట్ కరస్పాండెంట్ శ్రీనివాస రావు,ప్రిన్సిపాల్ మంజుల వాణి తెలిపారు.ఆదివారం న్యూబోయిన్‌పల్లిలోని సీతారాంపూర్ వాణి కాన్వెంట్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పలు వైజ్ఞానిక ప్రదర్శనలతో తమ ప్రతిభను కనబరిచారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస రావు,ప్రిన్సిపాల్ మంజుల వాణి,ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను స్వీకరించి భవిష్యత్తును శక్తివంతం చేసుకునేందుకు మంచి పుస్తకాలను చదువడం అలవాటు చేసుకోవాలని వింగ్ కమాండర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. న్యూ బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్ పాఠశాలలో గ్యాడ్యుయేషన్ 'డే' ఘనంగా నిర్వహించారు. టి.బాలారెడ్డి చైర్మన్, కరస్పాండెంట్ టీఏ రెడ్డి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను ప్రదానం చేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సువర్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. – బొల్లారం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

చిలకలగూడ చౌరస్తా వద్ద బ్లాక్ ఫిల్మ్ తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 9: ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం చిలకలగూడ చౌరస్తా వద్ద అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్ వేసుకున్న వాహనాలను గుర్తించి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. నిబంధనలను పాటించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో బెల్టులు ప్రదానం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు

బొల్లారం, ఫిబ్రవరి 9:సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో సెల్ఫ్ డిఫెన్స్,మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం చాలా ప్రాముఖ్యమని లయన్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ షేక్ కలీమ్ అన్నారు.ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 4వ ఇంటర్నేషనల్ కరాటే,కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బొల్లారానికి చెందిన లయన్ మార్షల్ ఆర్ట్స్ కేంద్రంలో శిక్షణా పొందుతున్న విద్యార్థులు కరాటేలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు.ఈ మేరకు టోర్నమెంట్ వ్యవస్థాపకులు పి.వి.శ్రీరాములు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ షేక్ కలీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమీర్‌పేట్: భారత–కన్నిన్జుకు సంస్థ ఆధ్వర్యంలో జపాన్ షోటోకాన్ కరాటేలో శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది చిన్నారులు ఆదివారం అమీర్‌పేట్‌లోని గురుగోవింద్ సింగ్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందుకున్నారు. వివిధ స్థాయిల్లో శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు కరాటే కోచ్ మురళీధర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లతో పాటు బెల్టులను అందుకున్నారు. కరాటే మాట్లాడుతూ చిన్నారుల్లో శారీరక మానసిక సమతుల్యతకు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ దోహదం చేస్తాయన్నారు. ప్రత్యేక ఆసక్తితో శిక్షణ పొందుతున్న మాస్టర్ గౌరీశంకర్ ముదిరాజ్, లాస్యకు (పర్పుల్), స్నేహ అర్జున్ కు (గ్రీన్), శశాంక్, కరిష్మాలకు బ్రౌన్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారుల తల్లిదండ్రులతో పాటు క్రీడ ఔత్సాహికులు పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ఎం.శ్రీనివాస్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ ట్రావెల్ నిర్వాహకుడు ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లిలో నివాసముండే ఎం.శ్రీనివాస్ (50) అనే వ్యక్తి కార్లు రెంట్కు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె ఉన్నారు. ఓ కుమారుడు కెనడాలో ఉన్నత చదువు అభ్యసించడానికి వెళ్లాడని, ఇటీవల కూతురు వివాహం కూడా చేశాడు . కూతురు కొన్నిరోజులుగా ఇక్కడే ఉంటుందని, వారం రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ, ఆర్థిక సమస్యల వల్ల జీవితంపై విరక్తి చెంది తన ఇంటికి దగ్గరలో ఉన్న పాపయ్య ఎస్టేట్లోనే భవనం పైనుంచి దూకి అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

ముషీరాబాద్, ఫిబ్రవరి 9: అయ్యప్ప సేవా సంఘం వ్యవస్థాక అధ్యక్షురాలు సుశీలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం బీఆర్ఎస్ నేత ముఠా జయసింహా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళర్పించి, అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా సర్వే సమగ్రంగా జరుగలేదు

సమావేశంలో మాట్లాడుతున్న దండి వెంకట్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు నిర్వహించబోయే ఎన్నికల్లో ఎబీసీడీ వర్గీకరణతో నిర్వహించాలని బహుజన లెఫ్ట్ పార్టీ, బహుజన కమ్యూనిస్టు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో ఎంబీసీ కులాల జనాభా లెక్కల వివరాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ ఎ జాబితాలోని 68 కులాల జనాభా సర్వే సమగ్రంగా జరుగలేదని ఆయన అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కుల గనణ నిర్వహించి స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ కులాలకు రిజర్వేషన్ అమలు చేయబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించందన్నారు. కానీ 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎబీసీడీ వర్గీకరణ అమలు చేయకుండా జనరల్ గా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీ ఎ జాబితాలో ఉన్న 68 కులాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్దిరాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్ల సాయికృష్ణ, రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

నృత్యకారులను సత్కరించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి

ముషీరాబాద్, ఫిబ్రవరి 9: చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కెవి రమాణాచారి జన్మదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన నృత్యప్రదర్శన పలువురి ఆకట్టుకుంది. నృత్య గురువు తులసి బృందంచే నృత్య ప్రదర్శనలు కనువిందుగా సాగాయి. వల్లూరి శ్రీహరిచే శయన ఘట్టం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ముఖ్యఅతిధిగా పాల్గొన్ని నృత్యకారులను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంకె రాము, రాజగోపాల్, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు. న్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, బీఆర్ఎస్‌ను ప్రజలకు మరింత చేరువ చేయాలని భోలక్‌పూర్ బీఆర్ఎస్ పర్యవేక్షకుడు దీన్‌దయాల్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. భోలక్‌పూర్ డివిజన్ విస్తృతస్థాయి బూత్ కమిటీ సమావేశం ఆదివారం డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు అధ్యక్షతన గంగపుత్ర సంఘం కమ్యూనిటీహాల్‌లో జరిగింది. దీన్‌దయాల్‌రెడ్డి, వై.శ్రీనివాసరావులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, సీనియర్ నాయకులు జహీరుద్దీన్ సమర్, మునావర్‌చాంద్, ఉమాకాంత్, చాంద్‌పాషా పాల్గొన్నారు.